క్లుప్తంగా

పర్వతారోహకురాలికి అభినందన

భీమవరం (ప్రకాశంచౌక్): సాహసోపేత కార్యక్రమాలకు వయస్సుతో సంబంధం లేదని వాణి నిరూపించిందని పలువురు వక్తలు అన్నారు. పర్వతారోహణ విజయవంతం చేసిన గొట్టుముక్కల వాణిను శుక్రవారం అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో యూత్ హాస్టల్స్ సభ్యుల సమక్షంలో యూత్ హాస్టల్స్ కార్యాలయంలో అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, మాట్లపూడి సత్యనారాయణ, కటికరెడ్డి వెంకటరత్నం , కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉమా సోమేశ్వరుని సేవలో శ్రీధర్



సోమేశ్వరస్వామి వారి సన్నిధిలో మైనార్టీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్ దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం గునుపూడి శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వారిని శుక్రవారం రాష్ట్ర మైనార్టీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు.

అఖండ అన్న సమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం, కొవ్వాడ పుంత వెంకటాపురంలో శ్రీ మావుళ్లమ్మ వారి ఏడో జాతర మహోత్సవం సందర్భంగా శుక్రవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల సహకారంతో 4,000 వేల మందికి అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారికి ఈ ప్రాంతంలోని మహిళలు విశిష్ట పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి జాతర వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

చిట్టడవిని తలపిస్తున్న రైతు సేవ కేంద్రం



మోగల్లు రైతు భరోసా కేంద్రం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు

పాలకోడేరు: మండలంలోని మోగల్లు సచివాలయం-1 పరిధిలోని రైతు భరోసా కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి చిట్టడవిని తలపిస్తుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళుతూ ఉంటారు. రైతు సేవ కేంద్రం చుట్టూ పెరిగిన పొదల్లో పాములు చేరే అవకాశం ఉండడంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది మాత్రం ఆవరణను శుభ్రంగా ఉంచడంలో విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రైతు సేవ కేంద్రం చుట్టూ శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న శాకంబరి అలంకరణ



శాకంబరిగా దర్శనమిస్తున్న శ్రీదుర్గా లక్ష్మి

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక గొల్లవాని తిప్ప రోడ్డులో ఉన్న శ్రీ దుర్గా లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకులు శ్రీరామచంద్ర మూర్తి అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి చీర, సారే సమర్పించారని ఈఓ గొట్టుముక్కల నాగ సీతారామరాజు తెలిపారు. పి.రమేష్ రాజు దంపతులు, చంద్రశేఖర్, పరాలరావు, ఎ.బాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందని మధ్యాహ్న భోజన, పారిశుద్ధ్య జిల్లా సమన్వయకర్త కె. కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలో కొత్తపేట స్పెషల్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. హెచ్ఎంలు విక్రాంత్ విజయ్, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముంపు ముప్పు

- ఉప్పుటేరుకు బుడమేరు, రామిలేరుతో తప్పని తంటా
- గోదావరి ఎగువ వరదలతో దిగువకు తప్పని ప్రమాదం



ఉప్పుటేరు ప్రవాహానికి అడ్డంకిగా గతంలో నిర్మించిన రైల్వే వంతెన



సిద్ధిపురం-రాజులకొట్టాడ ప్రాంతంలో ముంపునీటిలో వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆకివీడు: ఉప్పుటేరు నీటి ప్రవాహానికి గుదిబండగా ఉప్పుటేరుపై రెండో రైల్వే వంతెన ఉంది. అస్తవ్యస్తంగా నిర్మించి, వంతెన మధ్య ఉన్న మట్టిని గత పదేళ్లుగా తొలగించకపోవడంతో ఉప్పుటేరు ముంపు బెడద తీర గ్రామాలకు తప్పడం లేదు. ఆకివీడుకు సమీపంలోని దుంపగడప వద్ద ఉన్న ఉప్పుటేరుపై రెండో రైల్వే వంతెన నిర్మించారు. నీటి పారుదల నిబంధనలకు విరుద్ధంగా డిజైన్ వేసినప్పటికీ ఆ శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఉప్పుటేరులో భారీ బండలతో వంతెన నిర్మించారు. గత కొన్నేళ్లుగా ఉప్పుటేరులో పూడికలు తీయకపోవడంతో మట్టి మేటలు వేసి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉన్న ఉప్పుటేరు ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఉంది. ఇది రాను రానూ 8 వేలకు పడిపోయిందని చెబుతున్నారు.

ఆ వంతెన నిర్మాణం గుదిబండ

డబుల్ రైల్వే లైన్ కోసం నిర్మించిన వంతెన, జాతీయ రహదారి కోసం నిర్మాణంలో ఉన్న వంతెనల ప్రాంతంలో మట్టి పూడికలు చేశారు. వీటి వల్ల నీటి ప్రవాహం భారీగా మందగించింది. కొల్లేరు తీరంలోనూ, ఉప్పుటేరు పొడవునా కిక్కిస భారీగా పెరిగిపోవడంతో నీటి ప్రవాహం మందగించింది. దీని వల్ల ఎగువనున్న పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఉప్పుటేరుకు చేర్చి ఉన్న సిద్ధాపురం, చినమిల్లిపాడు, రాజులపేట, కోళ్లపర్రు, దుంపగడప, మందపాడు, అయిభీమవరం, ఏలూరుపాడు తదితర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. భారీగాపంట నష్టం ఏర్పడుతోంది. పాలకులు ఎంత మంది మారినా వంతెన ప్రాంతాన్ని పరిశీలించి, పూడికలు తీయించివేస్తామని ప్రకటించి వెళ్లిపోతున్నారు. ఆ తరువాత వరదల్లో వచ్చి కనిపిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

వేధిస్తున్న ముంపు ముప్పు

కొల్లేరు, ఉప్పుటేరుకు ముంపు ప్రమాదం పొంచి ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. బుడమేరు ముంపు నీటిని కొల్లేరుకు మళ్లించడంతో రానున్న రోజుల్లో ఉధృతంగా నీరు వచ్చే ప్రమాదం ఉందని గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన చెందుతున్నారు. రామిలేరు, తమ్మిలేరు, గోదావరి, కృష్ణా నదుల అదనపు నీరు కూడా కొల్లేరు, ఉప్పుటేరుల్లోకి చొచ్చుకువచ్చే అవకాశం ఉందంటున్నారు. ఉప్పుటేరులో ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వాటిని నేటికీ తొలగించకపోవడంతో బుడమేరు నీరు చొచ్చుకువస్తే తీవ్ర ప్రమాదం తప్పదంటున్నారు.

మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు



ఉప్పుటేరులో పూడికలు తీయించాలని, రైల్వే డబుల్ లైన్ వంతెన నిర్మాణంలో వేసిన వ్యర్థాలనవు, మట్టిని తొలగించాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. కోట్లాది రూపాయల పంట నష్టం వాటిల్లుతోంది. వేసవిలో చేయాల్సిన పనులు నేటికీ చేయలేదు. వర్షాకాలం వస్తే ముంపు బెడద తప్పడం లేదు. డ్రెయినేజీ శాఖ కాలువలు, డ్రెయిన్లు ఎప్పుడు తవ్వాలో తెలియని స్థితిలో ఉంది.

– అల్లూరి సోమరాజు, రైతు, సిద్ధాపురం

ఉప్పుటేరును ప్రక్షాళన చేయాలి



ఉప్పుటేరు పూడికతీత పనులు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కొంత మేర జరిగాయి. సుమారుగా 70 ఏళ్ల క్రితం వరకూ ఉప్పుటేరులో పార మట్టి తీసిన దాఖలాలు లేవు. భారీ వర్షాలు, ఎగువ కాలువలు పొంగితే ఉప్పుటేరు ఆనుకుని ఉన్న గ్రామాలే కాదు, లోపలి గ్రామాలు, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఉప్పుటేరు ప్రక్షాళనకు కేంద్రం నిధులు మంజూరు చేయాలి.

– గొట్టుముక్కల బాబ్జీరాజు, మాజీ ఎంపీపీ, అయిభీమవరం

రేపు పాలకొల్లులో దివ్యాంగులకు పరికరాల పంపిణీ

భీమవరం(ప్రకాశంచౌక్): దివ్యాంగుల కోసం అవసరమైన ఉచిత ఉపకరణాల ఎంపిక, గుర్తింపు శిబిరాన్ని ఆదివారం పాలకొల్లులో నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాను బాధ్యత నిర్వర్తిస్తున్న ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన సెయిల్ నుంచి రూ.50 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులను ఈ కార్యక్రమం కోసం మంజూరు చేయించామని పేర్కొన్నారు. పాలకొల్లు లోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

నేడు ఎన్ఆర్ఈజీఎస్ మండల ప్రజావేదిక

ఉండి: మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని 19 గ్రామాల్లో నిర్వహించిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై గత వారం పదిరోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్తి చేశారు. అయితే మండలంలో జరిగిన పనులకు,చెల్లించిన చెల్లింపులకు ఏ మాత్రం పొంతన లేదని సామాజిక తనిఖీ బృందాలు ప్రతి గ్రామ సభలోనూ తేల్చేశారు. మండల వ్యాప్తంగా సుమారు రూ.6 కోట్ల విలువైన 1081 పనులు నిర్వహించగా వాటిలో రూ.3 కోట్ల వరకు అధిక చెల్లింపులు చేసినట్లు సామాజిక తనిఖీ అధికారులు భావిస్తున్నారు. అంతే కాక బినామీ ఖాతాల్లోకి మళ్లించిన నగదు మరింత ఉంటుందని తనిఖీ అధికారులు భావిస్తున్నారు. అయితే శనివారం జరిగే మండలస్థాయి ప్రజావేదిక సభలో జిల్లా ఉన్నతాధికారులు ఎంత వరకు నిజాలు నిగ్గుతేల్చుతారో తెలియాల్సి ఉంది.

గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్టు తయారీ పరిశీలన



సిద్ధాపురం గ్రామంలో గుర్రపుడెక్కతో వర్మీ తయారీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

ఆకివీడు: వ్యర్థాలతో సంపద సృష్టి కేంద్రంలో విజయవంతంగా వర్మీ కంపోస్టు చేస్తున్న మహిళలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో గుర్రపుడెక్కను ఉపయోగించి వర్మీ కంపోస్టు తయారు చేసే పైలెట్ ప్రాజెక్టును శుక్రవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తయారు చేసిన వర్మీకంపోస్టు విధానాన్ని ఆమె ప్రసంశించారు. ఈ సందర్భంగా పీడీ గంగాధర్ మాట్లాడుతూ రెండు నెలలకు 7 టన్నుల కంపోస్టు తయారు చేసి బ్యాగుల ద్వారా విక్రయిస్తున్నట్లు చెప్పారు. టన్ను రూ. 12000లు విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, ఏపీఎం శేషవాణి, సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, నున్న గణపతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొర్రా సుజాత పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ ఆకివీడులోని పలు మంచినీటి చెరువుల్ని పరిశీలించారు. ప్రజలకు రక్షిత నీరు సరఫరా చేయాలని కమిషనర్ కృష్ణమోహన్‌ను ఆదేవించారు.

చిత్తశుద్ధితో పీ4 అమలు చేయాలి

కాళ్ల: పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మండలంలోని బొండాడ గ్రామంలో పీ-4 గ్రామసభను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో గుర్తించిన 128 బంగారు కుటుంబాలకు సంబంధించిన డేటాను పంచాయతీ కార్యదర్శి గ్రామ సభలో పేరుపేరునా చదివి వినిపించగా, కలెక్టర్ నాగరాణి వారి స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సీపీఓ కె.శ్రీనివాసరావు,వై.దోశిరెడ్డి, డాక్టర్ కేసీహెచ్.అప్పారావు, ఎంపీడీఓ జి.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశం



వేంద్రలో మాట్లాడుతున్న సీడీపీఓ వాణి విజయరత్నం

పాలకోడేరు: బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశం శుక్రవారం మండంలోని వేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కడలి నాగేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీఓ వాణి విజయరత్నం మాట్లాడుతూ ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారం బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల వల్ల అవగాహన కలిగి ఉండాలి అన్నారు. మరో ముఖ్యఅతిథి రాజేష్ మాట్లాడుతూ జీవో నెంబర్ 31, 39 అలలు తప్పక పాటించి బాల్య వివాహాలను నిరోధించడమే కాకుండా, బాలల సంరక్షణ గురించి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పంచాయతీ కార్యదర్శి జి.కృష్ణ మోహన్, వీఆర్వో జి. మధుసూదన్ రావు, అంగన్‌డి సూపర్‌వైజర్ పార్వతి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాయలంలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ క్రాంతి కుమార్

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో శుక్రవారం ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది డ్రై డే సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఇళ్ల ఆవరణలో ఉన్న పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, డ్రైనేజీ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే దోమలు రాకుండా ఇంటి కిటికీలకు దోమలు రాకుండా మెస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, వైరల్ జ్వరాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరికైనా జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: రక్తదానం మహాదానమని, రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారికి ప్రాణదాత అవుతామని అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతా భాయ్ అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, వివిధ శాఖల ఎన్జీవోలు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. గీతాభాయ్ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులకు, శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఎంతో అవసరమైన రక్తం కొన్ని సందర్భాల్లో దొరకదని అటువంటి వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. సిబ్బంది రక్తదానం చేయడం 25 యూనిట్లు రక్తం సేకరించామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎమ్ఎస్‌వీఎస్ భద్రిరాజు, వైస్ చైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, డిస్ట్రిక్ట్ ఎస్‌పీసీఎస్ ఆఫీసర్ మధు, జీఎమ్ కృష్ణరావు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ఉండి: రక్తదానం చేయడం ప్రాణదానం చేయడంతో సమానమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మేధావి విభాగం కన్వీనర్, యంగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు.శుక్రవారం భీమవరంలో నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది రక్తదాన శిబిరంలో గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ పీఎం చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది కూడా పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయ్, ఎల్‌టీఓ డాక్టర్ రవిశంకర్, సీపీఎం మధుసూధన్ తదితరులు గుడ్ ల్యాంప్ ఆర్గనేజేషన్ ప్రతినిధులను అభినందించారు.

నేటి నుంచి బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవాలను శనివారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం భీమవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వారం రోజులపాటు పలు కళాశాల, పాఠశాలలో అవగాహన సదస్సులు విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని, 23న ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ కె.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం ఉంటేనే యువతకు భవిష్యత్

భీమవరం అర్బన్: మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు పెరుగుతున్న సాంకేతికను అందిపుచ్చుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని హెచ్ఎం సత్యవాణి అన్నారు. మండలంలోని గూట్లపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం నిర్వహించి ఐటీ, ఐటీ టీఈఎస్, బీఎఫ్ఎస్ఐ తదితర నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యవాణి మాట్లాడుతూ యువత వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటేనే తమ భవిష్యత్‌ను అభివృద్ధి పథకంలోకి తీసుకురాగలమని అన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్లు వి.మౌనిక, కె. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాళీపట్నం భూముల పరిశీలన



కాళీపట్నంలో భూములను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో పాతపాడు, జగన్నాథపురం, కాళీపట్నం తూర్పు, కాళీపట్నం పడమర, కొత్తోట గ్రామాల సెటిల్మెంట్ భూములు సంబంధించి శుక్రవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఎంజాయిమెంట్ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ భూములకు సంబంధించిన మ్యాప్ లను పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగన్నాథపురం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డులన్నీ ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. గ్రామ కంఠం భూములకు సంబంధించిన అడంగల్ లో నమోదు చేసిన ఇళ్లకు సంబంధించి క్రయ, విక్రయాలు రిజిస్ట్రేషన్ వెసులుబాటు కల్పించాలని జేసీని రైతులు కోరారు. గ్రామ కంఠం భూములు సర్వే చేయించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రాజాకిషోర్, జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, మండల ల్యాండ్ సర్వేయర్ ఎ.దనరాజ్, డీటీ జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం



మాట్లాడుతున్న ఎస్‌వీఆర్ వరప్రసాద్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్ వి ఆర్ వరప్రసాద్ తెలిపారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. భీమవరం పీపీ రోడ్ స్టాఫ్ క్వార్టర్స్‌లో 6059 గజాల స్థలం 15 ఏళ్ల కాలానికి, భీమవరం బస్ స్టేషన్ పై భాగం 2000 గజాల స్థలాన్ని 5 ఏళ్ల కాలానికి, ఆకివీడు బస్ స్టేషన్‌లో ఖాళీ స్థలాలు 3877 గజాలు 15 ఏళ్ల కాలానికి, నర్సాపురం బస్ స్టేషన్ పై భాగం 3524 గజాలు 5 ఏళ్ల కాలానికి లీజుకు ఇచ్చేందుకు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారస్తులు భీమవరం డీపీటీఓ ఆఫీస్ నుంచి టెండర్ ఫామ్ పొందవచ్చని సూచించారు. మరిని వివరాలకు 99592 25482, 83415 43351 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులకండం కోటేశ్వర రావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-165కు భూముల సేకరణపై విచారణ



రైతులతో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

వీరవాసరం: జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా వీరవాసరం గ్రామ రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై శుక్రవారం వీరవాసరం తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ చేపట్టారు. భూసేకరణపై జూన్ 14న అభ్యంతరాలు గడువు ముగియడంతో, వీరవాసరం గ్రామానికి చెందిన 18 మంది రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై శుక్రవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్మెంట్, తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలైన్మెంట్ మార్పు తమ పరిధిలోనిది కాదని, నష్టపరిహారం విషయంలో సర్వే నంబర్ ప్రకారం సమీప ప్రాంతాల్లో గత మూడు సంవత్సరాలగా జరిగిన లావాదేవీలను చూసి సరాసరిన ప్రభుత్వ నిబంధన ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. తమ భూములను ప్రభుత్వానికి అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని కాకపోతే తాము నష్టపోకుండా హెచ్చు మొత్తంలో న్యాయమైన నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా ఇప్పించాలని జాయింట్ కలెక్టరును రైతులు కోరారు. ఈ విచారణలో ఎన్‌హెచ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్అండ్‌బీ ఎన్.శ్రీనివాస్ రావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, సబ్ రిజిస్ట్రార్ ఎస్.కమల కుమారి, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఆర్. శ్రీను తెలిపారు. శుక్రవారం భీమవరం రైల్వే స్టేషన్ ఆవరణంలో బ్యానర్లు, వాల్ పోస్టర్లు, ఆడియో అండ్ వీడియో ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధానికి అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నెంబర్లు 139,1098,100 గురించి వివరించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ సీఐ దస్తగిరి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మించాలి

నరసాపురం: నరసాపురం తీరప్రాంతంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆర్.కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్‌భవానీ కోరారు. ఈ మేరకు శుక్రవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు.